సాక్షి
నిజామాబాద్
సోమవారం । 16 । జూన్ । 2025



అధిక వడ్డీలు.. వేధింపులు
పల్లెల్లో మళ్లీ మైక్రో ఫైనాన్స్ సంస్థలు మహిళలు, చిరు వ్యాపారులకు రుణాలు ఇస్తూ నిండా ముంచుతున్నాయి.
- 8లో ▸



బడిబాటలో 'ప్రత్యేక'..
బడిబాటలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు కోసం విద్యాశాఖ అధికారులు కార్యాచరణ రూపొందించారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
38.0 /24.2
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కలిసిన కలెక్టర్



నిజామాబాద్‌అర్బన్: జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన టి.వినయ్‌కృష్ణారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లాకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.

ఎస్సారెస్పీలోకి 2080 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి 2080 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో క్రమంగా ప్రాజెక్ట్ నీటి మట్టం పెరుగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా ఆవిరి రూపంలో 361 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5టీఎంసీలు)అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 1063.20 (13.83 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే రోజున 1056.80(7.82 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

పర్యాటకుల సందడి..



డొంకేశ్వర్(ఆర్మూర్): ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతానికి ఆదివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. డొంకేశ్వర్ మండలం చిన్నయానంకు వచ్చిన పర్యాటకులు కుటుంబ సభ్యులతో గడిపారు. పచ్చిక బయళ్లలో తిరుగుతూ ప్రకృతిని ఆస్వాదించారు. అక్కడే కలిసి భోజనాలు చేశారు. క్రికెట్ ఆడారు. యువతీ, యువకులు సెల్ఫీలకు ఫోజులిచ్చారు.

కారు బీభత్సం

మోపాల్ : మండలంలోని కులాస్‌పూర్‌కు చెందిన అరుణ్ అద్దెకు తీసుకున్న కారుతో ఆదివారం రాత్రి బీభత్సం సృష్టించాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. అరుణ్ దుబాయ్ నుంచి ఆదివారం మధ్యాహ్నం కులాస్‌పూర్‌కు వచ్చాడు. అనంతరం స్నేహితులతో కలిసి మద్యం సేవించిన అరుణ్ అతివేగంగా కారును నడుపుతూ కంజర్ వద్ద పేరం గంగారాం బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో గంగారాం తీవ్ర గాయాలయ్యాయి. అక్కడి నుంచి కారును ఆపకుండా వెళ్లిన అరుణ్.. మోపాల్‌లో రోడ్డు పక్కన పార్క్ చేసిన మరో రెండు బైక్‌లను ఢీకొట్టాడు. అనంతరం బోర్గాం(పి) వద్ద గల సంజీవ్‌రెడ్డి కాలనీలో పార్క్ చేసిన మరో బైక్‌ను ఢీకొట్టాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బీభత్సం సృష్టించిన కారును గుర్తించినట్లు తెలిసింది. గాయపడిన గంగారాంను ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు.

గ్రాంట్ గందరగోళం



■ ధర్పల్లి మండలంలోని ఓ కాంప్లెక్స్ హెచ్‌ఎం గ్రాంట్ వినియోగం కోసం సీనియర్ ఉపాధ్యాయులను పక్కనపెట్టి ఇటీవల బదిలీపై వచ్చిన ఓ జూనియర్ ఉపాధ్యాయినితో సంయుక్తంగా బ్యాంకు ఖాతా తీసి నిధులు డ్రా చేశారు.

■ భీమ్‌గల్ మండలంలో పీఎంశ్రీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని నిధుల దుర్వినియోగంపై పిల్లల తల్లిదండ్రులు నిలదీశారు.

ఈ రెండు ఘటనలు జిల్లాలోని పాఠశాల నిర్వహణ, మౌలిక వసతుల కల్పన కోసం వెచ్చించాల్సిన నిధుల దుర్వినియోగాన్ని ఎత్తుచూపుతున్నాయి. విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలేమి, కొందరు ప్రధానోపాధ్యాయులు నిధుల ఖర్చు చేయడంలో నిబంధనలు పాటించకపోవడంతో పాఠశాల నిర్వహణ గ్రాంట్‌తోపాటు ఇతర నిధులు దుర్వినియోగమవుతున్నాయి. ముఖ్యంగా ఆదర్శ పాఠశాలలు, పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలు, కాంప్లెక్స్ పాఠశాలల్లో నిధుల ఖర్చు విషయంలో పారదర్శకత కొరవడింది.

- దుర్వినియోగమవుతున్న పాఠశాల గ్రాంట్
- మార్గదర్శకాలను పట్టించుకోని కొందరు హెచ్‌ఎంలు
- పీఎంశ్రీ, ఆదర్శ పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా ఖర్చులు
- పర్యవేక్షణ మరిచిన ఉన్నతాధికారులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో 145 ఉన్నత పాఠశాలలు ఉండగా అందులో పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలు 28, ఉన్నాయి. ఆదర్శ పాఠశాలలు 8 ఉన్నాయి. వీటి పరిధిలో స్కూల్ నిర్వహణ నిధులు రూ.25 వేల నుంచి రూ. లక్షతోపాటు ఇతర నిధులు రూ.లక్ష వరకు వస్తాయి. అలాగే పీఎంశ్రీ పాఠశాలలకు వాటి నిర్వహణ ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.8 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు విడుదల చేస్తుంది. కానీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, అలసత్వం కారణంగా నిధుల ఖర్చులో పారదర్శకత కొరవడింది. చాలా చోట్ల క్యాష్‌బిల్స్ సమర్పిస్తున్నా ఆడిటింగ్‌లో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం జీఎస్టీ బిల్స్, ఓచర్లు సమర్పించాలి.


SAYYAD ZAKEER
FABRICATION & STEEL FURNITURE


Roshini Surgical Traders

జీఎస్టీ బిల్లుకు బదులుగా చూపించిన క్యాష్‌బిల్లు

ఆడిటింగ్‌లో లోపాలు

జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు వస్తున్న నిధులు చాలా తక్కువ, వాటి ఆడిటింగ్‌లో ఎలాంటి అవకతవకలు జరగడం లేదు. కానీ కాంప్లెక్స్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు ఆదర్శ పాఠశాలలు, గురుకులాలకు వస్తున్న నిధుల ఆడిటింగ్‌లో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చాలా మంది ప్రధానోపాధ్యాయులు జీఎస్టీ బిల్లుల ఓచర్లు చూపకుండా ఎస్టిమేషన్ బిల్లులు, క్యాష్ బిల్లులు చూపిస్తూ అందినకాడికి నిధులను దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఒకే సర్జికల్ ట్రేడర్స్ నుంచి..

నిజామాబాద్ డివిజన్‌లోని ఓ ఆదర్శ పాఠశాలకు గత మూడేళ్లుగా ఒకే సర్జికల్ ట్రేడర్స్ నుంచి రూ.75 వేల విలువైన సామగ్రిని కొనుగోలు చేశారు. అలాగే మరో ఆదర్శ పాఠశాలకు కార్పొరేట్ నిధి కింద విడుదలైన నిధుల ఖర్చులో పారదర్శకత లేకుండాపోయింది. పాఠశాల సముదాయాల పరిధిలో సీనియర్ ఉపాధ్యాయులు ఉన్నా కొందరు హెచ్‌ఎంలు తమకు అనుకూలమైన ఉపాధ్యాయులతో సంయుక్త బ్యాంకు ఖాతా తెరిచి నిధులు ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారు. పీఎంశ్రీ పాఠశాలలకు స్పోర్ట్స్ గ్రాంట్ కింద మంజూరవుతున్న నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

జిల్లాలో భూసార పరీక్షలు

- పైలట్ ప్రాజెక్టుగా సాలూర మండలం ఎంపిక
- ఎన్‌ఎంఎన్‌ఎఫ్ కింద జిల్లాలో 15 క్లస్టర్లలోనూ మట్టి పరీక్షలు


సాలూరలో మట్టి నమూనాలు సేకరిస్తున్న ఏఈవో

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లాలో వ్యవసాయ భూముల్లో భూసార పరీక్షలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు పైలట్ ప్రాజెక్టుగా బోధన్ డివిజన్‌లోని సాలూర మండలాన్ని ఎంపిక చేసింది. మరో పక్క నేషనల్ మిషన్ ఫర్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్‌ఎంఎన్‌ఎఫ్) కింద జిల్లా వ్యాప్తంగా 15 క్లస్టర్లలో కూడా భూసార పరీక్షలు చేయా లని వ్యవసాయ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఈ మట్టి పరీక్షలు ప్రస్తుత ఖరీఫ్ నుంచే ప్రారంభించాలని సూచించింది. దీంతో పైలట్ ప్రాజెక్టు అయిన సాలూరలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు (ఏఈవోలు) మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. మొత్తం 8 వేల శాంపిల్స్ తీయాలని లక్ష్యం ఉండగా సాలూర మండలంలో 6125, ఎన్‌ఎంఎన్‌ఎఫ్ కింద జిల్లా అంతటా 1,875 శాంపిల్స్ సేకరించనున్నారు. ప్రతి కమతం కవరయ్యే విధంగా భూసార పరీక్షలు చేపట్టాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఇందుకు వారు ఆసక్తి గల రైతులను గుర్తించి పేర్లు నమోదు చేసుకుంటున్నారు. ఏఈవోలు రైతుల భూముల్లోకి వెళ్లి మట్టి నమూనాలు సేకరించి జిల్లాకేంద్రం మార్కెట్ యార్డులోని భూసార పరీక్షల కేంద్రానికి పంపనున్నారు. వారు భూసార పరీక్షల ద్వారా ఏయే పంటలకు నేల అనుకూలంగా ఉందో నివేదిక ఇవ్వనున్నారు. భూమిలో కర్బనాలు, నత్రజని, భాస్వరం, భౌతిక లక్షణం వివరాలు పూర్తిగా నివేదికలో ఉంటుంది. తద్వారా రైతులు నేల పరిస్థితిని బట్టి పంటలు సాగు చేసుకోవచ్చు. కాగా ఇప్పటి వరకు 400 మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు జిల్లా వ్యవసాయాధికారి వీరాస్వామి తెలిపారు. రైతులు భూసార పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్కానింగ్ సేవలు అందేనా..?

- ఆస్పత్రుల్లో పడిఉన్న యంత్రాలు
- రేడియాలజిస్టులు లేక తప్పని కష్టాలు
- ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లకు పరుగులు పెడుతున్న గర్భిణులు


మోర్తాడ్ ఆసుపత్రిలోని స్కానింగ్ యంత్రం

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్, ఏర్గట్ల మండల కేంద్రాలకు చెందిన గర్భిణులు లక్ష్మి, రాధ స్కానింగ్ చేయించుకునేందుకు మోర్తాడ్‌లోని 30 పడకల ఆస్పత్రికి వచ్చారు. ఇక్కడ స్కానింగ్ యంత్రం ఉన్నా రేడియాలజిస్ట్ లేకపోవడంతో స్కానింగ్ చేసే అవకాశం లేదని వైద్యులు, సిబ్బంది చెప్పారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో వారు ఆర్మూర్‌లోని ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లో ఫీజు చెల్లించి చేయించుకున్నారు. ఇది లక్ష్మి, రాధకు ఎదురైన పరిస్థితే కాదు. ఎంతో మంది గర్భిణులు తమ గర్భంలోని శిశువు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తోంది.

గత ప్రభుత్వం సామాజిక ఆస్పత్రులకు స్కానింగ్ యంత్రాలను సమకూర్చినప్పటికీ రేడియాలజిస్ట్‌లను నియమించకపోవడంతో ఆ విభాగం సేవలు అందడం లేదు. మోర్తాడ్, బాల్కొండ, ధర్పల్లి, డిచ్‌పల్లి, కోటగిరి, వర్ని, నవీపేట్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రులు, బోధన్ ఏరియా ఆసుపత్రి, ఆర్మూర్‌లోని వంద పడకల ఆస్పత్రి, జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రులకు స్కానింగ్ యంత్రాలను మంజూరు చేశారు. గైనకాలజిస్టులు, మత్తు వైద్యుల పోస్టులతోపాటు రేడియాలజిస్టుల పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. స్కానింగ్ సేవలు కేవలం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలోనే అందుతున్నాయి. గర్భిణులు ప్రసవం వరకు కనీసం మూడు సార్లు స్కానింగ్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఒక్కసారి స్కానింగ్‌కు వెళ్తే రూ.2వేల నుంచి రూ.3వేల వరకు ఖర్చవుతోంది.

ప్రభుత్వం దృష్టి సారిస్తేనే..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు గత ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టింది. అయితే లక్షలు వెచ్చించి స్కానింగ్ యంత్రాలను సమకూర్చి రేడియాలజిస్ట్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో సేవలు అందడం లేదు. ప్రస్తుత ప్రభుత్వమైన ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్కానింగ్ సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలి



విద్యార్థులతో సీపీ సాయిచైతన్య, ఎమ్మెస్సార్ ట్రస్ట్ సభ్యులు

నిజామాబాద్‌నాగారం: జీవితంలో ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఎంచుకుని, ఆ లక్ష్య సాధన కోసం కష్టపడుతూ ముందుకు సాగితే ఫలితం దక్కుతుందని సీపీ పి సాయిచైతన్య అన్నారు. ఎస్సెస్సీ, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన తెలంగాణలోని 11 జిల్లాల విద్యార్థినీవిద్యార్థులు 200 మందికి ఎమ్మెస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10వేల చొప్పున ప్రోత్సాహకాలు అందజేశారు. నగరంలోని బస్వాగార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఆర్థికస్థితిగతులతో సంబంధం లేకుండా కష్టపడి చదివిన విద్యార్థులకు ఎమ్మెస్సార్ ట్రస్ట్ నగదు ప్రోత్సాహకాలు అందజేసిందన్నారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం పైతరగతులకు వెళ్తున్న విద్యార్థులు కొత్త పరిచయాలను తమ ఉన్నతి కోసం వాడుకోవాలని సూచించారు. చెడు పరిచయాలకు దూరంగా ఉండాలని, కొత్త పరిచయాల క్రమంలో మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దన్నారు. వ్యక్తిత్వ వికాసం కోసం కష్టపడాలన్నారు. ఎమ్మెస్సార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం సాంబశివారెడ్డి, డైరెక్టర్లు ధనుష్‌రెడ్డి, జి.రాజిరెడ్డి, డాక్టర్ అబ్బాపూర్ రవి, వడ్డె శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

మూలకు చేరిన బగ్గీ వాహనం

- రూ. లక్షల ప్రజాధనం వృథా



నిజామాబాద్ సిటీ: ప్రజల సొమ్ముతో రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేసిన వాహనం మూలనపడింది. ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు నగరంలో పర్యటిస్తూ పనులను పర్యవేక్షించడానికి బ్యాటరీతో నడిచే బగ్గీ వాహనాన్ని కొనుగోలు చేశారు. రెండేళ్ల క్రితం అప్పటి అర్బన్ ఎమ్మెల్యే, ఇతర అధికారులతో ఈ వాహనం నగరంలో చక్కర్లు కొట్టింది. లక్షల రూపాయలు ఖర్చుచేసి ఆర్భాటంగా కొనుగోలు చేసిన బగ్గీ వాహనం ప్రస్తుతం బల్దియాలోని పార్కింగ్ స్థలంలో వృథాగా పడి ఉంది. అధికారులు స్పందించి వాహనాన్ని వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలతో మమేకమవుతున్నారు

- సత్ఫలితాలిస్తోన్న 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం'
- పట్టణ, గ్రామాల్లో విస్తృత తనిఖీలు
- పాత నేరస్తులు, అసాంఘిక కార్యకలాపాలపై ఆరా
- ఫుట్ పెట్రోలింగ్‌తో నిఘా


కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు(ఫైల్)

ఖలీల్‌వాడి : పోలీసులు ప్రజలతో మమేకం అవుతున్నారు. నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజల భాగస్వామ్యంతో ముందుకు కదులుతున్నారు. ఇప్పటికే కళాజాత బృందాల ద్వారా గ్రామాలు, పట్టణాల్లో వివిధ రకాల మోసాలపై ప్రజలకు నాటకాలు, పాటల రూపంలో అవగాహన కల్పిస్తున్నారు. గతంలో ఉన్న కార్డన్ సర్చ్ (నిర్బంధ తనిఖీలు)ని ప్రస్తుతం 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం'గా మార్చారు. దీంతో అపరిచిత వ్యక్తులు సంచరించినప్పుడు పోలీసులకు తెలపడం, సీసీ కెమెరాల ఏర్పాటుతో ప్రయోజనాలు, మద్యం తాగి వాహనాలు నడపడంతో కలిగే దుష్పరిణామాలు, సైబర్ మోసాలు తదితర అంశాలపై వివరిస్తూ ప్రజలకు దగ్గరవుతున్నారు.

భారీగా వాహనాలు స్వాధీనం

పోలీసులు చేపడుతున్న కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం సత్ఫలితాలిస్తోంది. పోలీస్ కమిషనర్ పోతరాజు సాయిచైతన్య ఆదేశాల మేరకు పోలీసు బృందాలు జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 25 ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించాయి. రిజిస్ట్రేషన్ పత్రాలులేని 700 లకు పైగా వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించి వదిలేశారు. నల్లబెల్లం, రేషన్ బియ్యం నిల్వలు, నిషేధిత పొగాకు ఉత్పత్తులు, దేశీదారు వంటి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుంటున్నారు.

యువతపై ప్రత్యేక దృష్టి..

పోలీసు తనిఖీలంటే ప్రజలు భయపడకుండా ఉండేందుకు 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం'ను నిర్వహిస్తున్నారు. స్థానిక ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి సమస్యలను తెలుసుకొని వీలైనంత వరకు పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులకు ఆశ్రయిం ఇవ్వొద్దని సూచిస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వారి వివరాలను సేకరించి, తగు చర్యలు తీసుకోవడానికి పోలీసులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా యువకులపై పోలీసులు ప్రధాన దృష్టి కేంద్రీకరించారు. ఎలాంటి దురలవాట్లకు గురికాకుండా ఉండేలా అవగాహన కల్పిస్తున్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్లకు పంపే లింకులు ఓపెన్ చేయడంతో కలిగే దుష్పరిణామాలు వివరిస్తున్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని సూచిస్తున్నారు. గుట్కా, గంజాయి, మద్యం తదితర వాటికి యువత దూరంగా ఉండాలని, లేకుంటే కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతాయని చెప్తున్నారు. ఘర్షణలు, హత్యలు, ఇతర నేరాలకు పాల్పడితే ఏర్పడే ఇబ్బందులను కూలంకషంగా వివరిస్తున్నారు.

కొత్తగా 'ఫుట్ పెట్రోలింగ్'

సీపీ సాయిచైతన్య వచ్చిన తర్వాత కమిషనరేట్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో కొత్తగా ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ప్రధాన ప్రాంతాల్లో పోలీసు బృందాలు డాగ్‌స్క్వాడ్ ద్వారా తనిఖీలు చేపడుతున్నాయి. హోటళ్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రధాన కూడళ్ల వద్ద ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి అనుమానితుల వివరాలను సేకరిస్తున్నారు. అనుమానం ఉంటే స్టేషన్‌కు తరలించి ఆరా తీస్తున్నారు. ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బంది కలిగించేలా రోడ్డుపై అడ్డంగా వాహనాలు, తోపుడు బండ్లు, షాపులు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటున్నారు.

నమ్మకం కలిగిస్తున్నాం

పోలీసులపై ప్రజలకు నమ్మకం కలిగిస్తున్నాం. గతంలో గ్రామాలు, పట్టణాల్లో కొత్తగా ఎవరైనా వస్తే సులభంగా తెలిసేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ద్వారా తనిఖీలు చేపడుతున్నాం. పాత నేరస్తుల కదలికలు, అసాంఘిక కార్యకలాపాలు, రేషన్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా తదితర అక్రమ దందాలపై సమాచారం సేకరిస్తున్నాం. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తాం.
– విజయ్‌బాబు, సీఐ, బోధన్ రూరల్

క్లుప్తంగా

యోగాతో మానసిక ప్రశాంతత



రుద్రూర్: యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఆరోగ్య కరమైన జీవన శైలి అలవడుతుందని బోధన్ కోర్టు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్ప సాయి అన్నారు. మండలంలోని అక్బర్‌నగర్‌లోగల సంస్కార్ ప్రకృతి చికిత్సాలయంలో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం యోగాపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై సాధకులతో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం మాట్లాడుతూ.. యోగా ద్వారా దైనందిన జీవితంలో వచ్చే ఒత్తిడిని తగ్గించుకోవచ్చునని అన్నారు. యోగా, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు శారీరక, మానసిక, ఆధ్యాత్మిక అభ్యాసమని అన్నారు. వీటిని ఆచరించడం ద్వారా జీవన కాలం పెంపొందించుకోవచ్చునని అన్నారు. యోగా శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకోవాలని సూచించారు. సంస్కార్ ప్రకృతి ఆశ్రమం వ్యవస్థాపకులు మార్ని రామ కృష్ణారావ్, యోగా మాస్టర్ సాయిలు, బచ్చు రాము తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



బోధన్‌రూరల్: పట్టణంలోని ఆచన్‌పల్లి హనుమాన్ ఆలయానికి ఆదివారం ఫాదర్స్‌డే సందర్భంగా మహారాష్ట్రలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హరిబాబు తన తండ్రి జ్ఞాపకార్థం రూ.1,01,606 విరాళం ప్రకటించారు. ఆలయ కమిటీ ప్రతినిధులకు ఆయన విరాళం అందించారు. కార్యక్రమంలో ఆచన్‌పల్లి పెద్దలు, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు వేసిన రూరల్ ఎమ్మెల్యే



డిచ్‌పల్లి: నిజామాబాద్‌లోని ముబారక్‌నగర్‌లో గల ఆర్‌బీవీఆర్‌ఆర్ పాఠశాల సొసైటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఈ సొసైటీ ఎన్నికల పోలింగ్‌కు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరై, తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బడిబాటలో 'ప్రత్యేక' పిల్లల గుర్తింపు

- ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం 'పాఠశాల సంసిద్ధత' కార్యక్రమం
- ప్రతీ మండలంలో ఒక భవిత కేంద్రం ఏర్పాటు
- ఎంఈవోలు, ఐఈఆర్పీలకు ఉన్నతాధికారుల ప్రత్యేక సూచనలు



జిల్లాలో దివ్యాంగ విద్యార్థులను గుర్తించడానికి సర్వే నిర్వహిస్తున్న ఐఈఆర్పీ సిబ్బంది (ఫైల్)



ఆర్మూర్‌లోని భవిత కేంద్రం

ఆర్మూర్: బడి బాటలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు కోసం విద్యాశాఖ అధికారులు కార్యాచరణ రూపొందించారు. సమాజంలో నిరాదరణకు గురవుతున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లల (దివ్యాంగులు)ను బడుల్లో చేర్పించి, సాధారణ విద్యార్థులతో సమానంగా విద్యాబుద్ధులు నేర్పించడానికి విద్యాశాఖ, తెలంగాణ సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం సంయుక్తంగా ప్రణాళిక సిద్ధం చేసింది. రాష్ట్ర స్థాయి అధికారులు ఇచ్చిన సూచనల మేరకు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విద్యా హక్కును పూర్తిస్థాయిలో వారికి అందేలా అమలు చేయనున్నారు. అందుకు ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం 'పాఠశాల సంసిద్ధత' కార్యక్రమాన్ని అధికారులు సూచించిన ప్రణాళిక ప్రకారం నిర్వహిస్తున్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారిని బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

ఇంటింటికీ ప్రచారం..

విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి సాధారణ విద్యార్థులతో పాటు ప్రత్యేక అవసరాలు గల పిల్లలను పాఠశాలల్లో చేర్పించుకోవడానికి పాఠశాల సంసిద్ధత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాల మేరకు జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో కార్యాచరణను అమలు చేయడం ప్రారంభించారు. అందులో భాగంగా సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ (ఐఈఆర్పీ)ల సహకారంతో ముందుకు సాగుతున్నారు. గ్రామాలలో సర్వేల ఆధారంగా గుర్తించిన ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, ప్రతీ మండలంలో ఉన్న భవిత కేంద్రాల్లో చేర్చుతున్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తూ బడి బయటి ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఇళ్లను సందర్శించి బడుల్లో చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ప్రత్యేక శ్రద్ధ చూపించాలి..



ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు శిక్షణనిస్తూ పాఠశాలల్లో చేర్పించే విషయంలో ఐఈఆర్పీలతో పాటు ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. బడిబాట కార్యక్రమంలో భాగంగా బడి బయట పిల్లలు ఉండకుండా పక్కా ప్రణాళిక ప్రకారం వారిని బడిలో చేర్పించాలి.

– అశోక్, డీఈవో, నిజామాబాద్

సేవాభావంతో..



ప్రత్యేక అవసరాలు గల పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తూ ఐఈఆర్పీలు నిర్వహిస్తున్న బాధ్యతలు డ్యూటీగా కాకుండా సేవగా గుర్తిస్తారు. సేవా భావంతో పని చేస్తూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పాఠశాల సంసిద్ధత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

– శ్రీనివాస్‌రావు, సెక్టోరల్ ఆఫీసర్, సమగ్ర శిక్ష, నిజామాబాద్

శ్రీరాముడు చేసిన లింగం

మీకు తెలుసా?



ఇసుక లింగం



లొంకలోని రామలింగేశ్వరస్వామి ఆలయం

సిరికొండ మండల పరిధిలోని దట్టమైన లొంక అడవుల్లో కొలువైన నీలకంఠ రామలింగేశ్వరస్వామి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది.

- త్రేతాయుగంలో రావణుడు సీతమ్మను అపహరించగా, శ్రీరాముడు వెతుకుతూ ఈ అడవుల్లోకి వచ్చినట్లు పురాణాలు చెబుతున్నాయి.
- రాత్రికి అడవిలోనే బస చేసిన శ్రీరాముడు ఉదయం పూజ చేసుకోవడానికి సెలయేరులో నుంచి ఇసుకను తీసుకువచ్చి లింగం చేసి పూజలు చేసినట్లు తెలుస్తోంది.
- శ్రీరాముడే స్వయంగా చేసిన లింగం కావడంతో రామలింగేశ్వరస్వామి ఆలయంగా పేరు పొందింది.
- మండల కేంద్రం నుంచి 8కిలోమీటర్ల దూరంలో గల అడవుల్లో ఈ ఆలయం ఉంది. ఆలయం చుట్టు ఎత్తైన గుట్టలు, పక్కన సెలయేరుతో ఎంతో ఆహ్లాదభరితంగా ఉంటుంది.
- మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో మూడు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు.

– సిరికొండ

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఆర్టీసీ డిపో మేనేజర్ల నంబర్లు

ఆర్టీసీ డిపో	ఫోన్ నంబర్		
నిజామాబాద్ ఆర్ఎం	9959226011	నిజామాబాద్–1 డీఎం	9959226016
ఆర్మూర్ డీఎం	9959226019	నిజామాబాద్–2 డీఎం	9959226017
బోధన్ డీఎం	9959226001	కామారెడ్డి డీఎం	9959226018
		బాన్సువాడ డీఎం	9959226020

ఎస్సై కొట్టారని సీపీ కార్యాలయానికి బాధితుడు

ఖలీల్‌వాడి: భీమ్‌గల్ ఎస్సై మహేశ్‌తోపాటు కానిస్టేబుళ్లు తనను కొట్టారని రూప్లాతండాకు చెందిన బీను అనే వ్యక్తి శనివారం జిల్లా కేంద్రంలోని సీపీ క్యాంప్ కార్యాలయానికి వచ్చాడు. విషయం తెలుసుకున్న ఎస్బీ సీఐ శ్రీశైలం అతడి వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణ విషయంలో తన కొడుకు రాముతో గొడవ జరగగా, తాను భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లానని బీను తెలుపగా.. ముందు చికిత్స చేయించుకోవాలని బీనుకు సీఐ సూచించినట్లు తెలిసింది.

ఇదిలా ఉండగా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బీను తన కొడుకు నుంచి ఫిర్యాదు తీసుకోవద్దని స్టేషన్‌లో న్యూసెన్స్ చేశాడని భీమ్‌గల్ ఎస్సై మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనను కొట్టలేదని స్పష్టం చేశారు.

పూడుకుపోయిన నిజాంసాగర్ ఉపకాలువ

- సొంత ఖర్చులతో మరమ్మతులు చేపట్టిన అన్నదాతలు



మరమ్మతులు చేపడుతున్న రైతులు

నవీపేట: మండలంలో పూడుకుపోయిన నిజాంసాగర్ ఉపకాలువ పూడుకుపోవడంతో కాలువ కింది రైతులు సొంత ఖర్చులతో మరమ్మతులు చేపట్టారు. మండలంలోని కమలాపూర్, నాడాపూర్ గ్రామాలకు విస్తరించుకున్న నిజాంసాగర్ డి 50/4/10 ఉప కాలువతో పాటు కాలువ గట్టు (కెనాల్ ఇన్స్‌పెక్షన్ పాత్) ఇరువైపులా పూడుకుపోయింది. గత కొన్నేళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో ఇరువైపులా నడకకు అనుకూలంగా ఉన్న రోడ్డు చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, చెట్లు, గుంతలతో కూరుకుపోయింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు కాలువ కింది 250 ఎకరాల పరిధిలోని రైతులు ముందడుగు వేశారు. చదునుతో పాటు కాలువలోని పూడికను తొలగించేందుకు సంకల్పించిన రైతులు రూ. 2.70 లక్షల నగదును జమ చేశారు. ఆదివారం రైతులందరూ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని చకచకా పనులకు శ్రీకారం చుట్టారు. రెండున్నర కిలోమీటర్ల మేర పొక్లెయిన్‌తో చెట్లు, పొదలు, చెత్తాచెదారం, గుంతలను తొలగించి చదును చేశారు. పైపులైన్‌ను విస్తరించారు. పూర్తి మరమ్మతులకు అదనంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

అధిక వడ్డీలు.. వేధింపులు

- పల్లెల్లో మితిమీరుతున్న మైక్రో ఫైనాన్స్ ఆగడాలు
- తీవ్ర ఆందోళన చెందుతున్న బాధితులు



రామారెడ్డిలోని రమేష్ అనే వ్యక్తి ఇటీవల అవసరానికి మైక్రో ఫైనాన్స్ వారం గ్రూప్‌లో రూ.10వేలు అప్పు తీసుకున్నాడు. వారం వారం చెల్లింపుల్లో తేడా రావడంతో సదరు ఏజెంట్లు రాత్రి 10గంటల వరకు వేచి ఉండి వారం తాలూకా కిస్తీ పైసలు వసూలు చేసుకువెళ్లారు. రూ.పదివేలు తీసుకుంటే వడ్డీతో కలిపి రూ.17,000 వరకు మైక్రో ఫైనాన్స్ వారు వసూలు చేయడంతో అతడు తీవ్ర ఆవేదన చెందుతున్నాడు.

రామారెడ్డి: పల్లెల్లో మళ్లీ మైక్రో ఫైనాన్స్ సంస్థలు మహిళలు, చిరు వ్యాపారులకు రుణాలు ఇస్తూ వారిని నిండా ముంచుతున్నారు. ప్రజల అత్యవసరాన్ని ఆసరా చేసుకొని అధిక వడ్డీకి రుణాలు ఇచ్చి తీరా ఈఎంఐలు సకాలంలో చెల్లించకపోతే వేధింపులకు గురిచేస్తున్నారు. గతంలో మైక్రో ఫైనాన్స్ వేధింపులు తాళలేక ఎంతో మంది ఆత్మహత్య చేసుకున్న ఘటనలు జిల్లాలో ఉన్నాయి. అప్పట్లో ప్రభుత్వం వీటిని నిషేధించింది. కానీ మళ్లీ గ్రామాల్లో మైక్రో ఫైనాన్స్ సంస్థలు తమ కార్యకలాపాలు వేగంగా విస్తరింపజేస్తున్నాయి.

వాయిదా చెల్లింపులు..

మైక్రో ఫైనాన్స్ నిర్వాహకులు ముందుగా తమ ఏజెంట్లను గ్రామాల్లోకి పంపి పేద మహిళలు, సంఘాల సభ్యులను కలుస్తున్నారు. వారం, 15 రోజుల వాయిదా చెల్లింపులతో రుణాల ఆశ చూపుతున్నారు. డ్వాక్రా గ్రూపుల్లో సకాలంలో చెల్లించని వారు మైక్రో సంస్థలను ఆశ్రయిస్తున్నారు. 10నుంచి 12మంది మహిళలను గ్రూపుగా ఏర్పాటు చేసి 15 రోజుల్లోనే రుణం అందిస్తున్నారు. ఒక్కో గ్రామంలో 20 నుంచి 30 గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలు పొందినట్లుగా తెలుస్తుంది. కామారెడ్డి జిల్లాలో రామారెడ్డి, సదాశివనగర్ భిక్కనూరు, దోమకొండ, బీబీపేట మండలాల్లో ఈ తరహా రుణాలు ఎక్కువగా ఇస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈజీగా రుణం వస్తుండడంతో మహిళలు వీటికి ఆకర్షితులు అవుతున్నారు. తీరా ఆర్థిక ఇబ్బందులతో ఈఎంఐ చెల్లించకపోతే వేధింపులకు గురిచేస్తున్నారు. గ్రామాలలో మైక్రో ఫైనాన్స్ తమ కార్యకలాపాలను విస్తరిస్తున్న సంబంధిత అధికారులు నిలువరించడంలో విఫలమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా వడ్డీ వ్యాపారులపై దాడులు చేసి కేసులు నమోదు చేసిన పోలీసులు మైక్రో ఫైనాన్స్ సంస్థలను ఎందుకు నిలువరించడం లేదని అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, మైక్రో ఫైనాన్స్ సంస్థలు నిలువరించాలని ప్రజలు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



డ్వాక్రా సంఘాల మహిళలు ఎవరూ కూడా మైక్రో ఫైనాన్స్ రుణాలు తీసుకోవడం లేదు. మైక్రో ఫైనాన్స్ సంస్థలపై, వారి ఆగడాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాలలో ప్రజలు రుణాల కోసం మైక్రో ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయించవద్దు.

– భూమాగౌడ్, సీసీ, డ్వాక్రా సంఘం, రామారెడ్డి

క్రైం కార్నర్

ఆలయంలో చోరీ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలం హాజీపూర్ తండా జగదాంబ ఆలయంలో చోరీ జరిగినట్లు తండా వాసులు ఆదివారం తెలిపారు. ఆలయంలో శనివారం పూజలు చేసి వెళ్లిన పూజారి దుష్యానాయక్ ఆదివారం ఉదయం గుడిని తెరిచేందుకు వెళ్లగా ఆలయంలోని హుండీ బయట ఉండటాన్ని గమనించి తండావాసులకు సమాచారం ఇచ్చారు. హుండీని పరిశీలించిన తండా వాసులు అందులో సుమారు రూ. 30వేల నగదు ఉన్నదని, గుర్తుతెలియని దుండుగులు చోరీ చేశారన్నారు. ఘటనపై వారు పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ధాన్యం లారీ బోల్తా



డిచ్‌పల్లి: మండలంలోని సాంపల్లి గ్రామం వద్ద గల 44వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం ధాన్యం లారీ అదుపు తప్పి బోల్తా పడింది. డిచ్‌పల్లి వైపు నుంచి ఆర్మూర్ వైపు ధాన్యం బస్తాల లోడుతో వెళుతున్న లారీని రహదారి పక్కన నిలిపే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడినట్లు డిచ్‌పల్లి పోలీసులు తెలిపారు.

కొడుకును చంపిన కేసులో తండ్రి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ రవీందర్‌నాయక్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): భార్యపై కోపంతో కొడుకును హతమార్చిన కేసులో తండ్రిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ తెలిపారు. నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామానికి చెందిన అక్షితకు, లింగంపేట మండలం పొల్కంపేట గ్రామానికి చెందిన నర అనిల్‌కు కొన్నేళ్ల కిందట వివాహం జరుగగా, వారికి నాలుగేళ్ల శశాంక్ అనే కొడుకు, 7నెలల కూతురు మనుశ్రీ ఉన్నారు. కాగా ఈనెల 10న అనిల్ తన భార్య, పిల్లలతో కలిసి మెదక్ జిల్లా శాలీపేటలో జరిగిన బోనాల పండుగకు వెళ్లాడు. అక్కడ ఓ గొడవ జరగడంతో అనిల్ తన కుటుంబంతో కలిసి పొల్కంపేటకు చేరుకున్నాడు. ఇంటికి వచ్చాక మరోసారి గొడవ జరగగా అనిల్ తన భార్యను కొట్టాడు. ఈ నెల 12న అనిల్ తన భార్యను పోచారంలో దింపి కొడుకు శశాంక్‌ను బైక్‌పై ఎక్కించుకొని గ్రామశివారులోని పల్లెప్రకృతివనం వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ భార్యపై కోపంతో శశాంక్ నోరు, ముక్కు మూసి హత్య చేశాడు. అనంతరం కొడుకును పోచారంలోని తన అత్తగారింటికి తీసుకువచ్చి ఇంట్లో పడుకోబెట్టి వెళ్లిపోయాడు. అచేతనంగా ఉన్న కొడుకును చూసిన అక్షిత అనుమానంతో వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే బాలుడు మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. దీంతో తన కొడుకును హత్య చేశాడని తల్లి అక్షిత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మెదక్ జిల్లా బూర్గుపల్లి గేట్ వద్ద అనిల్‌ను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారించగా తానే కొడుకును హత్య చేసినట్లు అంగీకరించాడు. అతడి బైక్‌ను స్వాధీనం చేసుకొని అనిల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై మల్లారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ శ్రీశైలం, హోంగార్డ్ కాశయ్యపాల్గొన్నారు.

గంజాయి పట్టుకుని వదిలేసిన ఎస్సై!

ఖలీల్‌వాడి: ఆర్మూర్ సబ్ డివిజన్‌లోని ఓ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల రెండు గ్రామాల్లో ఆరుగురి దగ్గర పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆలస్యంగా తెలిసింది. ఈ ఆరుగురిలో మైనర్ బాలురు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే గంజాయి లభించిన తర్వాత ఎస్సై ఓ నలుగురిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ ఎస్సై వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్న తర్వాత కేసు కాకుండా ఉండేందుకు సెటిల్‌మెంట్ చేసుకున్నట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. ఓ ప్రజాప్రతినిధి వద్దకు ఈ వ్యవహారం వెళ్లడంతో కేసు లేకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఇదే పోలీస్‌స్టేషన్ పరిధిలోని మరో గ్రామంలో ఇద్దరు గంజాయితో పట్టుబడినట్లు తెలిసింది. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్న ఎస్సై వారిని పీఎస్‌కు పిలిపించుకుని తిప్పుకున్నారు.

తర్వాత వారి వద్ద చేతివాటం ప్రదర్శించారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే సదరు ఎస్సై భూ పంచాయితీలను పీఎస్‌లోనే చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పీఎస్ పరిధిలో గంజాయి అక్రమ దందా కొనసాగుతుందనే ఆరోపణలు గతం నుంచి ఉన్నాయి. విద్యార్థులను తనిఖీలు చేయరని గంజాయి సప్లైదారులు వారితో నిజామాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఆత్మీయ పలకరింపులు.. మధుర స్మృతులు

- జిల్లాలో పలుచోట్ల సమ్మేళనాలు నిర్వహించిన పూర్వవిద్యార్థులు
- ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో భావోద్వేగానికి గురైన చిన్ననాటి మిత్రులు



నగరంలో సమావేశమైన ఉమ్మడి జిల్లాలోని 2000 బ్యాచ్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుళ్లు

సాక్షి నెట్‌వర్క్: ఆత్మీయ పలకరింపులు.. ఆపాత మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. అరే ఎన్నాళ్లయింది కలుసుకుని.. పూర్తిగా మారిపోయావంటూ ఆనాటి స్నేహితులు ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో హర్షం వ్యక్తంచేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ గ్రామాల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నానాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటూ అనాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకున్నారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యార్థులు, గురువులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే నగరంలోని ఓ హోటల్‌లో ఉమ్మడి జిల్లాలోని 2000 బ్యాచ్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుళ్లు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కామారెడ్డిలోని సిద్ధార్థ జూనియర్ కళాశాల 1999–2001 బ్యాచ్ బైపీసీ విద్యార్థులు పట్టణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.



కామారెడ్డిలోని సిద్ధార్థ జూనియర్ కళాశాల 1999-2001 బైపీసీ విద్యార్థులు



అన్నారం జెడ్పీహెచ్ఎస్ 2009-10 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



గోపాల్‌పేట జెడ్పీహెచ్ఎస్ 2000-01 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



నిజామాబాద్‌లోని గిరిరాజ్ డిగ్రీ కళాశాల 2002-05 బీఏ గ్రూప్ విద్యార్థులు..



ఎల్లారెడ్డిలో జెడ్పీహెచ్ఎస్ 1983-84 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థుల బైక్ ర్యాలీ



లింగంపేట జెడ్పీ (బాలుర) పాఠశాల 1989-90 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



నస్రుల్లాబాద్ జెడ్పీహెచ్ఎస్ 2006-07 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటయింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీర్ వాహజ్ అలీ ఈ ఎన్నికలకు ముఖ్య అతిథిగా హాజరు కాగా, ఆయన సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా డాక్టర్ రమేష్ పవర్, అధ్యక్షుడిగా మహమ్మద్ అజ్మత్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా వినోద్‌నాయక్, కోశాధికారిగా వినోద్, ఉపాధ్యక్షులుగా వాగ్మారే సుభాష్, శ్యామ్, మంజునాథ్, వినోద్‌రెడ్డి, రాము, సంయుక్త కార్యదర్శులుగా ప్రశాంత్ కుమార్, బుచ్చన్న, మురళి, వినోద్, ప్రవీణ్, సంతోష్ ఎన్నికయ్యారు. పూర్తి కార్యవర్గాన్ని త్వరలో నియమిస్తానని అధ్యక్షుడు అజ్మత్ ఖాన్ వెల్లడించారు. ఎన్నికలకు ఎలక్షన్ ఆఫీసర్‌గా ఫుట్‌బాల్ కోచ్ నాగరాజు వ్యవహరించారు. ఒలింపిక్ అసోసియేషన్ అబ్జర్వర్‌గా అబ్దుల్ ఉమర్ వ్యవహరించారు. నెట్ బాల్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జయపాల్ తదితరులు పాల్గొన్నారు.